సాక్షి నంద్యాల

శనివారం ၊ 19 ၊ జూలై ၊ 2025



పచ్చ కప్పలు బెకబెక

ఆత్మకూరురూరల్‌: పసుపు వర్ణంలోని కప్పలు బెకబెకమంటూ ఆత్మకూరు పెద్ద కమేళా సమీపంలో పొలం గుంతల్లో కనిపించాయి. వర్షాలు కురిసినప్పుడు మాత్రమే ఇవి వస్తాయి.



అరుదైన చికిత్స

కర్నూలు పెద్దాసుపత్రి వైద్యులు అరుదైన చికిత్స చేశారు. ఎడమ భుజం నుంచి చేతికి వెళ్లే రక్తనాళం మూసుకుపోవడంతో స్టెంట్‌ వేసి సమస్యను సరిచేశారు.

8లో ▸



టీబీ డ్యాం సమాచారం


పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 33,844
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 33,486

న్యూస్‌రీల్‌

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్‌): జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. ఆత్మకూరు మండలంలో అత్యధికంగా 62.4 మి.మీ వర్షం కురియగా డోన్‌లో అత్యల్పంగా 1.8 మి.మీ వర్షం కురిసింది. అదే విధంగా శ్రీశైలంలో 55.4, నంద్యాల రూరల్‌లో 55.2, నంద్యాల అర్బన్‌, కొత్తపల్లెలో 54.2, పాములపాడులో 52.2, బండిఆత్మకూరులో 51.4, గడివేముల 48.4, పగిద్యాల 46.8, మిడుతూరు 43.2, జూపాడుబంగ్లా 36.2, వెలుగోడు 26.8, మహానంది 24.6, నందికొట్కూరు 17.8, పాణ్యం 16.2, బేతంచెర్ల, సంజామల, గోస్పాడు 8.2, శిరివెళ్ల 7.2, ఆళ్లగడ్డ 6.0, అవుకు 5.2, కొలిమిగుండ్ల, చాగలమర్రి 4.2, రుద్రవరం 4.0, దొర్నిపాడు 3.2, బనగానపల్లె 3.0 మి.మీ వర్షం కురిసింది.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



బానకచెర్ల నుంచి విడుదలవుతున్న నీరు

పాములపాడు: నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం బానకచెర్ల క్రాస్‌ రెగ్యులేటర్‌ నుంచి జీఎన్‌ఎస్‌ఎస్‌ గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 3 గేట్ల ద్వారా 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్‌ రెగ్యులేటరు నుంచి 25వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉంది. కాగా వీబీఆర్‌ (తెలుగుగంగ)కు 20వేల క్యూసెక్కుల నీటిని విడుదల కొనసాగుతుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మెయింటెనెన్స్‌ కింద రూ.22 కోట్ల నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి గోరుకల్లు రిజర్వాయర్‌ను నీటితో నింపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నందికొట్కూరు, శ్రీశైలం ఎమ్మెల్యేలు గిత్తా జయసూర్య, బుడ్డా రాజశేఖరరెడ్డి, సీఈ కబీర్‌, ఎస్‌ఈ శివకుమార్‌, ఈఈ కిష్టన్న, వెణుగోపాల్‌రెడ్డి, నాగేంద్ర కుమార్‌, డీఈ సుబ్రమణ్యారెడ్డి, నగేష్‌కుమార్‌, రవీంద్ర, ఆర్డీఓ నాగజ్యోతి, డీఎస్పీ రామాంజనేయులు నాయక్‌, తహసీల్దార్‌ సుభద్రమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్లీజ్‌.. పీ4 సభకు రండి!



గ్రామసభ వద్ద ప్రజల కోసం ఎదురు చూస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఉయ్యాలవాడ: బంగారు కుటుంబాల పేరుతో ప్రభుత్వం చేపట్టిన గ్రామసభలకు స్పందన కరువైంది. శుక్రవారం మండలంలోని అల్లూరు గ్రామంలో గ్రామసభ 11 గంటలకు ప్రారంభం కావాల్సి వుండగా ప్రజలు ఎవరూ హాజరు కాలేదు. 11.30 సమయం దాటినా ఎవరూ గ్రామసభకు రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌ రహీమ్‌ ఇంటింటికి వెళ్లి ప్రజలను గ్రామసభ వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు వచ్చిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్‌, ప్రజల భాగస్వామ్యంతో పేద కుటుంబాలను అభివృద్ధి చేయడమే పీ4 కార్యక్రమం ధ్యేయమని వివరించారు. వచ్చిన 10 మందితో గ్రామసభ మమ.. అనిపించారు.

నిబంధనలు అతిక్రమిస్తే మత్స్యకారుల లైసెన్స్‌లు రద్దు



మత్స్యకారులతో చర్చిస్తున్న అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్‌: కృష్ణానదిలో మత్స్యకారులు నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని మత్స్యశాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ పి.రవికుమార్‌ హెచ్చరించారు. నాలుగు రోజుల క్రితం శ్రీశైలండ్యాం సమీపంలో అనధికారికంగా రెండు వర్గాలు చేపల వేటకు వెళ్లి పడవలపై తెడ్లతో పరస్పర దాడులు చేసుకున్నాయి. ఈ ఘటన నేపథ్యంలో శుక్రవారం ఆయన లింగాలగట్టులో మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. మత్స్యకారులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా రాతపూర్వకంగా ఇస్తే ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. చేపలవేట నిషేధ కాలంలో వేట కొనసాగిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని, రద్దుచేసిన లైసెన్సులు పునరుద్ధరించమని హెచ్చరించారు. సాధారణ రోజుల్లో రిజర్వాయర్‌కు ముందు 150 మీటర్ల వరకు చేపలవేట సాగించరాదని ప్రభుత్వం జిఓ.నె. 186 తీసుకు వచ్చిందన్నారు. గత మంగళ వారం పరస్పర దాడులకు తెగబడిన వారిపై బైండోవర్‌ కేసులు నమోదు చేయాలని టూటౌన్‌ సీఐ చంద్రబాబుకు ఫిర్యాదు చేసినట్లు మత్స్యశాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రవికుమార్‌ తెలిపారు.

పతనం దిశగా.. మార్కెట్‌ చేజారగా!

అయ్యో.. అఖిల

- మార్కెట్‌ యార్డ్‌ చైర్మన్‌ పదవి జనసేనకు కేటాయింపు
- చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌ పదవులకు ముందుగానే బీ ట్యాక్స్‌
- అధిష్టానంపై అలకబూని గండ్లేరు నీటి విడుదలకు గైర్హాజరు
- చిచ్చురేపిన మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ల ప్రకటన
- మంత్రి టీజీ భరత్‌, ఎంపీ నాగరాజు మధ్య విభేదాలు
- బీసీలకు విలువ లేదని సన్నిహితుల దగ్గర వాపోయిన వైనం
- ఆదోనిలో టీడీపీకి ఇవ్వడంపై ఎమ్మెల్యే పార్థసారధి ఆగ్రహం

కూటమిగా ఏర్పడిన టీడీపీ, బీజేపీ, జనసేన నేతల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ల ప్రకటన ఇందుకు వేదికగా మారాయి. బీసీలకు విలువ లేదని కర్నూలు ఎంపీ అనగా.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని పట్టించుకోరా అని ఆదోని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేనకు ఎలా ప్రాధాన్యత ఇస్తారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే వర్గీయులు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక ఏమీ చేయకుండా తమ వర్గీయులకు పదవులు ఇవ్వాలని టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు కొట్లాడటం చర్చనీయాంశంగా మారింది.



ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ



మార్కెట్‌యార్డు చైర్మన్‌గా ఎంపికైన సురేఖ


ఆళ్లగడ్డ: జిల్లాలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారా? ఆమె, భర్త వ్యవహారశైలి అధికారపార్టీకి తలనొప్పిగా మారిందా? కూటమి ప్రభుత్వంలోని ఏ నాయకుడికీ వారు నచ్చడం లేదా ? ఇక వారిని పక్కన పెట్టాలి అనే ఆలోచనకు అధిష్టానం వచ్చిందా ?.. అని అంటే జరుగుతున్న సంఘటనలు చూస్తే అవుననిపిస్తోంది. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌ యార్డ్‌ కమిటీకి జనసేనలో ఓ వర్గానికి చెందిన మేలేరి మల్లయ్య భార్య సురేఖను నియమించడంపై నియోజకవర్గంలో అందరూ షాక్‌కు గురయ్యారు. దాదాపు మూడు నెలల క్రితమే జనరల్‌ కోటాలో కేటాయించిన ఈ పదవికి టీడీపీలోని సీనియర్‌ నాయకులు అనేక మంది పోటీ పడ్డారు. అయితే ఎవరు ఎక్కువ మొత్తం 'బీ' ట్యాక్స్‌ చెల్లిస్తే వారికే ఆ పదవి అని చర్చ కూడా జరిగింది. ఈ క్రమంలో ఎక్కువ మొత్తం ఇచ్చిన వారికి చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌ పదవులతో పాటు డైరెక్టర్‌ల పదవులు కూడా అమ్ముకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం అధిష్టానం దృష్టికి వెళ్లడంతో అఖిలప్రియకు చెక్‌ పెట్టేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆళ్లగడ్డ జనసేన పార్టీలోని ఓ వర్గం నేత మైలేరి సురేఖకు చైర్మన్‌గిరి కేటాయించారని చర్చ జరుగుతోంది.

అడ్వాన్స్‌ ఇచ్చి.. ఇరుక్కుపోయి!

మూడు నెలల క్రితం వెలువడిన నోటిఫికేషన్‌ ఆధారంగా ఆళ్లగడ్డ మార్కెట్‌ యార్డ్‌ చైర్మన్‌ పదవిని జనరల్‌కు కేటాయించారని తెలియగానే నియోజకవర్గంలో అనేక మంది పోటీ పడ్డారు. చివరకు రుద్రవరం మండలానికి చెందిన ఓ బీసీ నాయకుడు రూ.70 లక్షలు 'బీ' ట్యాక్స్‌ కడతానని ముందుకు రావడంతో పాటు ముందుగా రూ. 30 లక్షలు అడ్వాన్స్‌ ఇచ్చినట్లు సమాచారం. అలాగే వైస్‌ చైర్మన్‌గా దొర్నిపాడు మండలానికి చెందిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నేత రూ. 12 లక్షలకు మాట్లాడుకుని రూ.5 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించినట్లు సమాచారం. వీరితో పాటు అనేక మంది డైరెక్టర్ల పదవి కావాలనే వారు ఒక్కొక్కరు కనిష్టంగా రూ. 2 లక్షల నుంచి గరిష్టంగా రూ. 6 లక్షల వరకు బేరం మాట్లాడుకుని కొందరు అడ్వాన్స్‌ చెల్లించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు వీరంతా తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

అధిష్టానంపై అలక బూనిన అఖిల

కనీసం తనతో మాటమాత్రమైనా చర్చించకుండా మార్కెట్‌ యార్డు చైర్మన్‌ పదవి జనసేనకు కేటాయించడంతో ఒక్కసారిగా ఎమ్మెల్యే అఖిలప్రియ కంగుతిన్నట్లు తెలుస్తోంది. దీంతో శుక్రవారం గండ్లేరు రిజర్వాయర్‌ నుంచి తెలుగంగ నీటిని చెరువులకు విడుదల చేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె గైర్హాజరయ్యారని సమాచారం. చివరకు తెలుగుగంగ ప్రాజెక్ట్‌ చైర్మన్‌ సంజీవకుమార్‌రెడ్డి, నియోజకవర్గంలోని డీసీ చైర్మన్‌లతో అధికారులు నీటిని విడుదల చేయించారు.



మాట చెల్లక.. నేతల అలక

కర్నూలు(అగ్రికల్చర్‌): నామినేటెడ్‌ పద్ధతిపై నియమించిన వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్ల వ్యవహారం 'కూటమి' నేతల మధ్య చిచ్చు రేపింది. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల మధ్య అంతరాన్ని పెంచింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ మార్కెట్‌ కమిటీలకు చైర్మన్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17న ప్రకటించింది. ఇందుకు సంబంధించి జీవోలు రాకపోయినప్పటికీ అధికారికంగా చైర్మన్‌లను ప్రకటించారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌గా ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన మహిళకు ఇవ్వడంపై మంత్రి టీజీ భరత్‌, ఎంపీ బస్తిపాటి నాగరాజు మధ్య అంతరాన్ని పెంచింది. 'కూటమి ప్రభుత్వంలో బీసీ సామాజిక వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులకు కనీస విలువ లేదు' అని కర్నూలు ఎంపీ తన సన్నిహితుల దగ్గర వాపోయినట్లు తెలుస్తోంది. మార్కెట్‌ కమిటీలకు చైర్మన్‌లను ప్రకటించడంతో ఆదోనిలో టీడీపీ, బీజేపీ నేతల మధ్య విభేదాలు మరింత పెరిగాయి. ఆళ్లగడ్డలో మార్కెట్‌ కమిటీకి చైర్మన్‌గా జనసేనకు చెందిన వారిని ఎంపిక చేయడం స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు ఆగ్రహం తెప్పించినట్లు తెలుస్తోంది.

మంత్రి, ఎంపీ మధ్య పెరిగిన అంతరం

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌గా కర్నూలు మండలం రేమట గ్రామానికి చెందిన కురువ సుజాతను నియమించేందుకు ఎంపీ బస్తిపాటి నాగరాజు సర్వశక్తులు ఒడ్డారు. పూర్తి వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈ మహిళను చైర్‌పర్సన్‌గా నియమిస్తే రైతుల అభ్యున్నతికి దోహదపడే అవకాశం ఉంటుందని భావించారు. ఈ నియామకం కోసం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడులను కూడా ప్రత్యేకంగా కలిశారు. చైర్‌పర్సన్‌ పీఠం ఎంపీ ప్రతిపాదించిన మహిళకే దక్కుతుందనే చర్చ కూడా నడిచింది. అయితే ఉన్నట్టుండి మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ కర్నూలు నగరానికి చెందిన అజ్మత్‌బీని ఎంపిక చేయడం ఎంపీకి, ఎంపీ వర్గీయులకు తీవ్ర అసంతృప్తిని రగిలించింది. మంత్రి టీజీ భరత్‌ సిఫార్సులకే కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసింది. వ్యవసాయమంటే ఎరుగని వ్యాపార కుటుంబానికి వ్యవసాయ మార్కెట్‌ కమిటీకి చైర్‌పర్సన్‌గా నియమించడంపై ఎంపీ వర్గీయులకు తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని కలిగించింది. బీసీ ప్రజాప్రతినిధుల సిఫార్సులను కూటమి ప్రభుత్వంలో చెల్లుబాటు కావనే విషయం నిర్ధారణ అయిందనే విషయాన్ని ఎంపీ సన్నిహితుల దగ్గర ప్రస్తావిస్తున్నట్లు తెలుస్తోంది. కర్నూలు మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ నియామకం మంత్రి టీజీభరత్‌, ఎంపీ బస్తిపాటి నాగరాజు మధ్య అంతరాన్ని పెంచిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

టీడీపీ, బీజేపీ మధ్య పోరు తీవ్రం

ఆదోనిలో టీడీపీ, బీజేపీ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది. ఆదోని టీడీపీ ఇన్‌చార్జ్‌ మీనాక్షినాయుడు బహిరంగంగానే ఆదోని ఎమ్మెల్యే పార్థసారిధిపై విరుచుకుపడుతున్నారు. ఇటీవల చేపట్టిన అధికారుల బదిలీల్లోనూ టీడీపీ ఇన్‌చార్జ్‌ మీనాక్షినాయుడు సిఫార్సులు పనిచేయలేదు. అన్నింటిలోను టీడీపీని ఎమ్మెల్యే ఉద్దేశపూర్వకంగా పక్కన పెడుతున్నారనే విమర్శలు మీనాక్షినాయుడు వర్గీయుల నుంచి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆదోని మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా టీడీపీకి చెందిన జె.శారదను ప్రకటించడాన్ని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారధి జీర్ణించుకోలేకపోతున్నారు. తాను ఎమ్మెల్యేగా ఉండగా.. తాను సిఫార్సు చేసిన వారిని చైర్మన్‌గా ప్రకటించాలని, ఇందుకు విరుద్ధంగా టీడీపీ ఇన్‌చార్జ్‌ మీనాక్షినాయుడు చేసిన సిఫార్సులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే జీర్ణించుకోలేక పోతున్నారు. నియోజకవర్గానికి బీజేపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుంటే టీడీపీకి చెందిన మహిళను చైర్మన్‌గా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. చైర్మన్‌ ప్రకటన టీడీపీ, బీజేపీల మధ్య బంధాన్ని దెబ్బ తీసేదిగా మారిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

సార్‌.. ఎరువులు ఎక్కడ!

- రైతులను వేధిస్తున్న ఎరువుల కొరత
- రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు
- అధికారులను నిలదీస్తున్న రైతులు



అధికారులతో వాగ్వాదం పడుతున్న రైతులు

నంద్యాల(అర్బన్‌): ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభమై రెండో నెల గడుస్తోంది. అదను.. పదును చూసుకొని రైతులు దుక్కులు దున్నారు. సమయానికి అందాల్సిన విత్తనాలు, ఎరువులు జాడ కనిపించడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఖరీఫ్‌ ప్రారంభంలోనే రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఎరువుల కొరతతో పనులు మానుకుని రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కూటమి నేతల ఇళ్లకు నేరుగా ఎరువులు చేర్చుతున్న అధికారులు సామాన్య రైతుల అవస్థలు పట్టించుకోవడం లేదు. కానాల గ్రామం పీఏసీఎస్‌ (ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం) పరిధిలోని రైతులను ఎరువుల కొరత వేధిస్తోంది. కానాల సొసైటీ పరిధిలో పెద్దకొట్టాల, పాండురంగాపురం, పొన్నాపురం, చాబోలు, అయ్యలూరు, రైతునగర్‌, కానాల తదితర గ్రామాలకు సంబంధించి దాదాపు 2,500 మంది రైతులు, 6వేల హెక్టార్లలో పంటలు సాగు చేశారు. కానాల పీఏసీఎస్‌ పరిధిలో దాదాపు 2,500 మెట్రిక్‌ టన్నుల డీఏపీ, 270 మెట్రిక్‌ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 84 మెట్రిక్‌ టన్నుల డీఏపీ, 110 మెట్రిక్‌ టన్నుల యూరియా సరఫరా జరిగింది. వారం రోజులుగా ఎలాంటి ఎరువులు మంజూరు కాకపోవడంతో రైతులు ఎదురు చూస్తున్నారు. శుక్రవారం 400 బస్తాల యూరియా రావడంతో రైతులు ఒక్కసారిగా సొసైటీ భవనం వద్దకు చేరుకొని అధికారులతో వాగ్వాదం చేశారు. అప్పటికే కూటమి నేతలకు పంపిణీ చేయడం, మిగిలినవి నచ్చిన వారికి ఇచ్చినట్లు తెలుసుకోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీ పరిధిలో ఎరువుల పంపిణీ పారదర్శకంగా చేపట్టాలని, లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని స్థానిక అధికారులను హెచ్చరించారు. యూరియా సరఫరాలో ప్రభుత్వం చేతులెత్తేసిందని రైతులు చిన్నహుసేన్‌, వెంకటేశ్వర్లు, బాబు, షేక్‌ హుసేన్‌, కాశీం, తదితరులు విమర్శించారు.

ఏఐఐబీ పనుల పూర్తికి త్వరలో నిధులు

- పీఆర్‌ డీఈ, డీఈఈల సమీక్షలో ఎస్‌ఈ రామచంద్రారెడ్డి



ఇంజినీర్లతో సమావేశం నిర్వహిస్తున్న పీఆర్‌ ఎస్‌ఈ వి.రామచంద్రారెడ్డి

కర్నూలు(అర్బన్‌): జిల్లాలో ఏషియన్‌ ఇన్‌ఫ్రాక్చర్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ బ్యాంకు(ఏఐఐబీ) ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పూర్తి త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని, వివిధ కారణాలతో నిలిచిపోయిన పనులను ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారని పీఆర్‌ ఎస్‌ఈ వి.రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో కర్నూలు, నంద్యాల, ఆదోని ఈఈ, డీఈఈలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు ఏఐఐబీ నిధులతో మొత్తం 139 పనులు మంజూరు కాగా, వీటిలో వివిధ కారణాల వల్ల 29 పనులు డ్రాప్‌ అయ్యాయన్నారు. మిగిలిన 110 పనుల్లో ఇప్పటి వరకు 76 పూర్తి కాగా, మిగిలిన 34 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇందులో రూ.24 కోట్ల అంచనాతో ప్రారంభించిన గోరంట్ల బ్రిడ్జి పనులు ఇప్పటి వరకు దాదాపు 15 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను 2026 మార్చి నాటికి పూర్తి చేయాల్సి ఉందన్నారు. మొత్తం 34 పనులకు అవసరమైన రూ.96 కోట్లు విడుదలవుతాయని, ఎప్పటిలోగా వీటిని పూర్తి చేస్తారో తెలపాలన్నారు. నిధులు విడుదలైతే రోడ్లకు సంబంధించిన అన్ని పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తామని ఇంజనీర్లు స్పష్టం చేశారు. ఇంజనీర్ల అభిప్రాయాలను ఈఎన్‌సీ కార్యాలయానికి పంపుతామని ఎస్‌ఈ తెలిపారు. సమావేశంలో ఈఈలు సీఎస్‌సీ మద్దన్న, బీసీ వెంకటేష్‌, రఘురామిరెడ్డి, డీఈఈలు బండారు శ్రీనివాసులు, రవీంద్రారెడ్డి, మహేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, లక్ష్మినారాయణ, మల్లికార్జున, రమేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసురుల దౌర్జన్యం

- తనిఖీలకు వెళ్లిన అధికారులను బెదిరించిన వైనం

డోన్‌ టౌన్‌: తమ దందాకు అడ్డు వస్తే అంతు చూస్తామంటూ టీడీపీ నేతల అనుచరులు అధికారులను బెదిరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డోన్‌ నియోజకవర్గంలో ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. కూటమి పార్టీల నేతల అనుచరులు ఏరియాలు పంచుకుని ఇసుక దందాను నడుపుతున్నారు. పట్టణ శివార్లలో కోట్లనగర్‌, వైఎస్‌ నగర్‌, గుమ్మకొండ దాబా వెనుక, కోట్ల వారి పల్లె, మార్కెట్‌ యార్డు ప్రాంతాల్లో ఇసుక డంప్‌లను ఏర్పాటు చేసుకొని దర్జాగా వ్యాపారం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గత మూడు రోజుల క్రితం ఆర్‌ఐ స్థాయి అధికారి వీఆర్వోతో కలిసి పరిశీలనకు వెళ్లగా ఇసుకాసురులు అధికారులపై తిరగబడటమే కాకుండా 'మీ అంతూ చుస్తాం' అని బెదిరించినట్లు తెలిసింది. అధికారులను బెదిరించిన వారికి కూటమి నాయకుల అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే అధికారులు సైతం ఇసుకాసురులపై కనీసం ఫిర్యాదు చేయలేదని చర్చ జరుగుతోంది.

ఓపీఎస్‌ కోసం రోడ్డెక్కిన ఉపాధ్యాయులు

కర్నూలు(సెంట్రల్‌): పాత పెన్షన్‌ విధానం అమలు చేయాలని కోరుతూ డీఎస్సీ–2003 ఉపాధ్యాయులు రోడ్డెక్కారు. 2003లోనే నోటిఫికేషన్‌ వచ్చినప్పటికీ 2004లో పోస్టుల భర్తీ చేయడంతో పాత పెన్షన్‌ విధానం వర్తించదని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై వారు భగ్గుమన్నారు. కేంద్రంతో పాటు చాలా రాష్ట్రాల్లో 2003–04 సంవత్సరాల్లో ఎంపికైన ఉద్యోగులకు పాత పెన్షన్‌ ఇస్తుంటే ఏపీలో మాత్రం సీపీఎస్‌ను అమలు చేస్తామని చెప్పడంపై నిరసనకు దిగారు. శుక్రవారం ధర్నా చౌక్‌ వద్ద డీఎస్సీ–2003 ఉపాధ్యాయులు దీక్ష చేపట్టారు. వీరికి వివిధ ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ రాష్ట్ర నాయకులు హృదయరాజు మాట్లాడుతూ.. కేంద్రం పెన్షన్‌ శాఖ ఉత్తర్వుల ప్రకారం నోటిఫికేషన్‌ ఆధారంగా ఎంపికైన వారిని పాత పెన్షన్‌ పరిధిలోకి తీసుకురావాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. మొత్తం 10,982 మంది ఉన్నారని, ఇందులో విద్యాశాఖకు సంబంధించి 7,361 మంది, హోంశాఖకు సంబంధించి 1821, ఇతర శాఖల్లో 1800 మందికి పాత పెన్షన్‌ వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఆపాస్‌ నాయకులు సత్యనారాయణ, యూటీఎఫ్‌ నాయకులు రవికుమార్‌, ఎస్టీయూ నాయకులు గోకారి, పీఆర్‌టీయూ నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

- కలెక్టర్‌ రాజకుమారి



గిరిజనులకు ఇంటి సామగ్రి పంపిణీ చేస్తున్న కలెక్టర్‌ రాజకుమారి

బండి ఆత్మకూరు: గిరిజనుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్‌ రాజకుమారి అన్నారు. శుక్రవారం ఇండియన్‌ రెడ్‌ క్రాస్‌ సొసైటీ ఆధ్వర్యంలో జీసీ పాలెం, నెమళ్లకుంట గిరిజన గూడెంలోని గిరిజనులకు ఇంటి సామగ్రి పంపిణీ చేశారు. పీ4 కార్యక్రమంలో భాగంగా గూడెంలోని 43 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజనుల జీవన స్థాయిని మెరుగుపర్చేందుకు విద్య, ఆరోగ్యం, ఉపాధి, హౌసింగ్‌ వంటి రంగాలపై మరింత అవగాహన కల్పిస్తామన్నారు. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సర్వేలు, ధ్రువపత్రాల పంపిణీ, భూమి హక్కుల రిజిస్ట్రేషన్‌ వంటి కార్యక్రమాల్లో ఆయా శాఖలు సమన్వయంతో పనిచేసి వారికి భూ హక్కు పట్టాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వెంకట శివ ప్రసాద్‌, ఎంపీడీవో రామకృష్ణవేణి, తహసీల్దార్‌ పద్మావతి, పంచాయతీ అధికారులు, రెడ్‌ క్రాస్‌ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డును దున్నేసి.. పంటను సాగు చేసి!

- కానాలలో టీడీపీ నాయకుడి నిర్వాకం
- ఆయకట్టు రోడ్డు తమదేనంటూ బెదిరింపు



ఆయకట్టు రోడ్డును దున్ని కంది పంట సాగు చేసిన దృశ్యం

నంద్యాల(అర్బన్‌): కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకుల ఆక్రమణలు రోజురోజుకు శ్రుతిమించుతున్నాయి. అసైన్డ్‌ భూములు, వాగులు, వంకలు ఆక్రమించిన వారు ఇప్పుడు దర్జాగా ఏకంగా ఆయకట్టు రోడ్డు తమదేనంటూ బెదిరింపులకు పాల్పడుతున్న వైనమిది. నంద్యాల మండలం మేజర్‌ పంచాయతీ కానాల గ్రామంలో ఆయకట్టు రోడ్డుపై టీడీపీ నేత కన్నేశారు. నాలుగేళ్ల క్రితం రైతులంతా చందాలు వేసుకొని నిర్మించిన రోడ్డును దౌర్జన్యంగా ట్రాక్టర్‌తో దున్ని కందిపంటను వేశారు. దశాబ్దాల క్రితం కానాల నుంచి కోవెలకుంట్లకు వెళ్లే రహదారిలో బైసాని కృష్ణమూర్తి, నంద్యాల పక్కీర్‌షా పొలాల మధ్యన హైస్కూల్‌ కొట్టాల, నాగులవరం వరకు పోరంబోకు రస్తా ఉంది. గతంలో కరణం నాగేశ్వరరావు పోరంబోకు స్థలాలకు పట్టా పుట్టించుకొని పత్తి నాగయ్య, తదితరులకు సీలింగ్‌ ల్యాండ్‌ కింద అమ్మకాలు జరిపారు. కాలక్రమేణ కొంత మంది ఆ రస్తాను ఆక్రమించి పొలాలు సాగుచేశారు. ఆయకట్టు రోడ్డు లేక స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గ్రామ రైతులు చర్చించుకుని 2021 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వారంతా కలిసి 30 అడుగుల రహదారిని చందాలు వేసుకొని నిర్మించుకున్నారు. కేసీ కెనాల్‌ అధికారులు అక్కడక్కడ కల్వర్టులు ఏర్పాటు చేసి ఆయకట్టు రైతులు ధాన్యాన్ని ఇళ్లకు చేర్చుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. అప్పటి వరకు ఆక్రమణ దారుల్లో ఉన్న పోరంబోకు రస్తా ఆయకట్టు రోడ్డుగా మారింది. దీన్ని జీర్ణించుకోలేని స్థానిక టీడీపీకి చెందిన నాయకుడు పిట్టల హనీఫ్‌ ఇటీవల ఆయకట్టు రోడ్డును దున్ని కంది పంట వేశారు. ఆయకట్టు రోడ్డులో పంటలు వేయడం ఏమిటని పలువురు రైతులు నిలదీస్తున్నా వారిని బెదిరిస్తున్నారు. దీంతో పరిష్కార వేదికలో కలెక్టర్‌కు సమస్యను విన్నవించేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. టీడీపీ నాయకులకు ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేయడం పరిపాటిగా మారింది. అధికారులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తుండటంతో మరింత రెచ్చిపోతున్నారు.

ఎల్లెల్సీలో అక్రమాల ప్రవాహం!

- ఆధునికీకరణ పనుల్లో నిబంధనలకు తూట్లు
- నాణ్యత లేకుండా వేసిన కాంక్రీట్
- అస్తవ్యస్తంగా లైనింగ్ పనులు
- చోద్యం చూసిన టీబీ బోర్డు ఇంజినీర్లు

కర్నూలు సిటీ/ఆలూరు రూరల్: తుంగభద్ర దిగువ కాలువ ఆధునికీకరణ పనులు నాసిరకంగా జరిగాయి. టీబీ బోర్డు ఇంజినీర్ల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరించారు. నాణ్యత లేకుండా కాంక్రీట్ వేయడంతో చిన్న ప్రవాహానికే అది కొట్టుకుపోతోంది. టీబీ డ్యాం నుంచి తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు 24 టీఎంసీల వాటా ఉంది. ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్, రబీలో 151,413 ఎకరాలకు సాగునీరు, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ పట్టణాలతో పాటు 195 గ్రామాలకు తాగునీరు అందాల్సి ఉంది. ఎల్లెల్సీ 0/0 నుంచి 241 కి.మీ వరకు టీబీపీ బోర్డు పర్యవేక్షణలో ఉంది. ఈ కాలువను ఏడు దశాబ్దాల క్రితం నిర్మించారు. ఓ సంస్థ సర్వే చేసి హక్కుగా కేటాయించిన వాటా నీటిని రాష్ట్రాలు వాడుకోవాలంటే కాల్వ వరకు లైనింగ్ చేయాలని సూచనలు చేసింది.

పనులు ఇలా..

రాష్ట్రంలో గత టీడీపీ ప్రభుత్వం 2017–18లో ఎల్లెల్సీ పనులు రూ.590.65 కోట్లతో మొదలు పెట్టి వదిలేసింది. 2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తుంగభద్ర దిగువ కాలువకు వదిలేసిన లైనింగ్ పనులు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఎల్లెల్సీ 205 కి.మీ నుంచి 250 కిలోమీటర్ల వరకు 5 ప్యాకేజీలుగా రూ.180 కోట్లు, మరో నాలుగు ప్యాకేజీలు కర్ణాటక పరిధిలో సుమారు రూ.115 కోట్లు, మూడు డిస్ట్రిబ్యూటీలు రూ.100 కోట్లతో పనులు చేపట్టారు. కాంట్రాక్టర్లు పనులు మొదలు పెట్టే సమయానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బళ్లారికి చెందిన ఓ కాంట్రాక్టర్ ప్రభుత్వ పెద్దల అడ్డుకోవడంతో ఆలస్యంగా మొదలుపెట్టారు. కాలువకు నాలుగు నెలల క్రితం నీళ్లు బంద్ అయినా పనులు పూర్తి చేయలేకపోయారు.




బాపురం సమీపంలో కాల్వ గట్టుకు నాణ్యత లేకుండా వేసిన కాంక్రీట్, కాల్వకు నీరొచ్చే రోజున తెల్లవారుజామున వేసిన కాంక్రీట్



నీరొచ్చిన రోజు సాయంత్రం వేస్తున్న కాంక్రీట్

అక్రమాలు ఇవీ..

➡ కాల్వ లైనింగ్ పనులు 9 ప్యాకేజీల్లో చేపట్టగా ఇందులో 26,29,30, 31 ప్యాకేజీల పనులు కర్ణాటక పరిధిలో వస్తాయి.

➡ 205 నుంచి 250 కి.మీ వరకు 21,22,23,24,25 ప్యాకేజీలుగా చేపట్టారు.

➡ 21వ ప్యాకేజీ కాంట్రాక్ట్ టీడీపీకి చెందిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు కొంత పనిని చేసి, ఈ ఏడాది చేయలేనని నిలిపివేసి వెళ్లిపోయారు.

➡ 22వ ప్యాకేజీ కాంట్రాక్టర్ భూపాల్ రెడ్డి చేపట్టారు. ఈయన చేసిన పనుల్లో ఏ మాత్రం నాణ్యత ప్రమాణాలు పాటించలేదు. ఎంత శాతం పూర్తి అయ్యిందో కూడా ఇంజినీర్లు చెప్పలేకపోతున్నారు.

➡ 23వ ప్యాకేజీ కాంట్రాక్ట్ స్టాండర్డ్ ఇనాఫ్రా, 24 ,25 ప్యాకేజీలు శ్రీనివాస ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వారు పనులు దక్కించుకున్నారు. నాణ్యత పాటించడం లేదు.

➡ కాల్వ లైనింగ్ చేసేటప్పుడు ఇరువైపులా గట్టును స్లోప్ చేసి ఆ పైన ఎర్రమట్టినింపి గట్టిప డేలా వాటర్ కొట్టి స్లోప్ రోలింగ్ చేయాలి. కానీ ఎక్కడ కూడా స్లోప్ రోలింగ్ యంత్రం వినియోగించలేదు.

➡ కాల్వ గట్టు ఇరువైపులా జేసీబీ బకెట్‌తో స్లోప్ చేసి దానిపై బంకమట్టి వేసిన తరువాత సీసీ లైనింగ్ చేయాలి. కానీ నాణ్యత లేని మట్టిని వినియోగించి లైనింగ్ చేసినట్లు తెలుస్తోంది.

➡ బావాపురం సమీపంలో కాల్వకు నీరొచ్చేందుకు కనీసం 72 గంటల ముందే కాంక్రీట్ పనులు పూర్తి అయి ఉండాలి. కానీ నీరొచ్చేందుకు కొన్ని గంటల ముందు వరకు అక్కడ పనులు చేశారు. అక్కడ వాడిన కాంక్రీట్‌లో కంకర, సిమెంట్‌తో పాటు, ఇసుక వినియోగించాలి. కానీ డస్ట్‌తో వేసి మిల్లర్‌లో మిక్సీ చేసి కాంక్రీట్ వేశారు.

➡ కాలువలో వేసిన కాంక్రీట్ బెడ్‌లో నాణ్యత ప్రమాణాలు పట్టించుకోకపోవడంతో కంకర బయటికే వచ్చింది.



కుంటనహాల్ దగ్గర జరుగుతున్న లైనింగ్ పనులు

నీరొచ్చిన రోజు పనులు చేశారు

తుంగభద్ర దిగువ కాలువ లైనింగ్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేటట్లు చర్యలు తీసుకున్నాం. నీరొచ్చిన రోజు తెల్లవారుజాము వరకు బాపురం దగ్గర పనులు చేశారు. నీరొచ్చేందుకు మూడు, నాలుగు గంట ముందు వరకు కాంక్రీట్ పని చేయవచ్చు. 21వ ప్యాకేజీలో కొంత పని మాత్రమే చేశారు. కాల్వకు నీరు బంద్ అయ్యాక పెండింగ్ పనిని చేయిస్తాం.

– నారాయణ నాయక్, టీబీ డ్యాం ఎస్ఈ

క్లుప్తంగా

12 నుంచి గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత మహిళలకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నాలుగు విభాగాలలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కె.పుష్పక్ తెలిపారు. టైలరింగ్‌లో 31 రోజులు, ఎంబ్రాయిడరీ మగ్గం వర్క్‌లో 31 రోజులు, బ్యూటీపార్లర్‌లో 35 రోజులు, జ్యూట్‌బ్యాగ్ తయారీలో 14 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు12 నుంచి శిక్షణా తరగతులు మొదలవుతాయన్నారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు మహిళలు అర్హులన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. వివరాలకు కర్నూలు శివారు బి.తాండ్రపాడులోని కెనరా బ్యాంకు–గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (డీఆర్‌డీఏ–టీటీడీసీ ప్రక్కన)లో, లేదా 9000710508, 63044 91236 నెంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసులు నమోదు చేయండి

కర్నూలు(సెంట్రల్): ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటి ద్వారా అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులను ఆదేశించారు. హంద్రీ, తుంగభద్రల నుంచి ఇసుక ఎక్కువగా అక్రమ రవాణా అవుతున్నట్లు పత్రికల్లో వర్తాలు వస్తున్నాయని, వాటిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. కథనాలపై స్పందించి నిల్వలను సీజ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక అక్రమ రవాణాపై వీఆర్వోలు సమాచారం ఇవ్వకపోతే వారిపైనా చర్యలు తప్పవన్నారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై నివేదికలు పంపాలని ఆదోని సబ్‌కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు టౌన్ డీఎస్పీ బాబుప్రసాద్, ఆర్‌టీఓ భరత్, మైనింగ్ అధికారి రవిచంద్, భూగర్భ జల శాఖ డీడీ శ్రీనివాస్, పీసీబీ ఈఈ పి.కిశోర్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి ఆకస్మిక మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెలో బీటెక్ విద్యార్థి శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ నేత సూరపురెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కుమారుడు అఖిలేశ్వరరెడ్డి(19) ఢిల్లీలోని ఓ యూనివర్సిటీలో బీటెక్ ఫస్టియర్ పూర్తి చేసుకొని సెలవులు కావడంతో రెండు నెలల క్రితం కనకాద్రిపల్లెకు వచ్చాడు. అయితే నాలుగు రోజుల క్రితం నరాలకు ఇన్‌ఫెక్షన్ సోకడంతో కర్నూలులోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చారు. అక్కడి వైద్యుల సూచన మేరకు రెండు రోజుల నుంచి గ్రామంలోని ఆర్‌ఎంపీ వైద్యుడి వద్ద ఫ్లూయిడ్స్ ఎక్కిస్తున్నారు. ఉదయం వెళ్లి ఫ్లూయిడ్స్ ఎక్కిస్తున్న సమయంలో అఖిలేశ్వరరెడ్డి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు తాడిపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని ఇంటికి వద్దకు తీసుకురాగానే గ్రామస్తులతో పాటు బంధువులు పెద్ద ఎత్తున చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి,జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు పేరం నందకిషోర్‌రెడ్డి, నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, సత్తిగారి రామిరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు విద్యార్థి మృత దేహం వద్ద నివాళులర్పించి తండ్రి చంద్రశేఖర్‌రెడ్డిని పరామర్శించారు.

ప్రభుత్వ ఉద్యోగిపై దాడి హేయమైన చర్య



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ, ఆల్‌మేవా నాయకులు

నంద్యాల(వ్యవసాయం): విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై టీడీపీ నాయకుల దాడి హేయమైన చర్య అని, వారిని వెంటనే అరెస్ట్ చేయాలని నంద్యాల ముస్లిం జేఏసీ, ఆల్‌మేవా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక క్రాంతి రేఖా గ్రంథాలయంలో శుక్రవారం నంద్యాల ముస్లిం జేఏసీ కన్వీనర్ అబ్దుల్లా రషాదీ, ఆల్ మేవా ఏపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలీం, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్.మహమ్మద్ అబులైస్, ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా చాగలమర్రి ఎంపీడీఓ కార్యాలయంలో విధుల్లో ఉన్న డిప్యూటీ ఎంపీడీఓ తాహెర్ హుస్సేన్‌పై జరిగిన దాడిని నంద్యాల ముస్లిం జేఏసీ, ఆల్‌మేవా సంఘాల తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చాగలమర్రి ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 15వ తేదీన మార్గదర్శి బంగారు కుటుంబం సమావేశం నిర్వహిస్తుండగా చల్లా నాగరాజు అనే స్థానిక టీడీపీ నాయకుడు, సమావేశానికి తనను పిలువలేదని అనుచరులతో డిప్యూటీ ఎంపీడీఓ తాహెర్ హుస్సేన్‌పై పాల్పడడం అమానుషమన్నారు. చల్లా నాగరాజు గతంలో ఇద్దరు అధికారులపై ఇలాగే దౌర్జన్యం చేశాడని తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు అబ్దుల్ సమ్మద్, ఇన్సాఫ్ బాబా ఫక్రుద్దీన్, ఎస్‌డీపీఐ మజీద్ ఖాన్, కోశాధికారి ఎస్పీ బాషా, కో కన్వీనర్ మస్తాన్, ఆల్‌మేవా మహమ్మద్ గౌస్, మిల్లీ కౌన్సిల్ అడ్వకేట్ అసదుల్లా, ఏఐఎంఐఎం సమీర్, నూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి కార్డియాలజీలో అరుదైన చికిత్స

- మూసుకుపోయిన ఎడమ భుజం రక్తనాళానికి స్టెంట్



స్టెంట్ వేయించుకున్న చంద్రావతితో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): ఎడమ భుజం నుంచి చేతికి వెళ్లే రక్తనాళం మూసుకుపోవడంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్యులు స్టెంట్ వేసి సమస్యను సరిచేశారు. శుక్రవారం ఆసుపత్రిలోని కార్డియాలజి విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుతో కలిసి హెచ్‌ఓడీ డాక్టర్ ఆదిలక్ష్మి మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే.. 'మిడుతూరుకు చెందిన చంద్రావతి(45)కి గత నెల 29న కళ్లు తిరగడం, ఎడమ చేతినొప్పితో ఆసుపత్రికి వచ్చింది. వైద్యపరీక్షలు చేసిన కార్డియాలజి వైద్యులు భుజం నుంచి చేతికి వెళ్లే రక్తనాళం(సబ్ క్లేవియాన్ ధమని)లో రక్తం గడ్డకట్టి పూర్తిగా మూసుకుపోయినట్లు గుర్తించారు. ఈ సమస్యకు తమ వైద్య బృందం ఈ నెల 14న సబ్ క్లేవియన్ ధమనికి యాంజియోప్లాస్టీ ద్వారా స్టెంట్ వేశారు. చికిత్సకు ప్రైవేటులో అయితే రూ.2లక్షల నుంచి రూ.2.5లక్షల వరకు ఖర్చు అవుతుంది. అయితే ఆసుపత్రిలో ఉచితంగా స్టెంట్ వేశాం. ఆమె పూర్తిగా కోలుకుంది. సబ్ క్లేవియాన్ ధమనిలో స్టెంట్ వేయడం చాలా అరుదుగా జరుగుతుంది' అని వివరించారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ లలితకుమారి, డాక్టర్ రాజ్‌కుమార్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

విష్ణు వర్గీయుడి దౌర్జన్యం

- రోడ్డు పనులు చేస్తున్న హిటాచీపై రాళ్ల దాడి



హంద్రీ కాలువపై మట్టిని చదును చేస్తున్న హిటాచీ (ఇన్‌సెట్లో) హిటాచీ అద్దం పగిలిన దృశ్యం

కర్నూలు: కోడుమూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్ రెడ్డి వర్గీయుడుగా చెప్పుకుంటున్న గార్గేయపురం వాసి ఓ కాంట్రాక్టు సంస్థకు చెందిన డ్రైవర్‌ను బెదిరించి హిటాచీపై రాళ్లతో దాడి చేశాడు. కర్నూలు మండలం గార్గేయపురం పొలిమేర అయ్యకుంట సమీపంలో హంద్రీనీవా కాలువకు ఉన్న ఎర్రమట్టిని టిప్పర్ల ద్వారా తరలించేందుకు హిటాచీ పని చేస్తుండగా గార్గేయపురం వాసి అక్కడికి వెళ్లి 'ఎవరు పర్మిషన్ ఇచ్చారు? ఎర్రమట్టి మా రెడ్డి అనుమతి లేకుండా ఎలా తీసుకెళ్తారు?' అంటూ గురువారం సాయంత్రం డ్రైవర్‌ను తీవ్రంగా దూషించి హిటాచీపై రాళ్లతో దాడి చేయడంతో మొత్తం అద్దాలు ధ్వంసమయ్యాయి. కేతవరం–గార్గేయపురం గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి దగ్గర కాలువ కట్టకు నల్లమట్టి రోడ్డు ఉన్నందున వర్షానికి టిప్పర్ల రాకపోకలకు ఇబ్బంది తలెత్తడంతో అయ్యకుంట సమీపంలో కాల్వకు ఉన్న ఎర్రమట్టిని రోడ్డు ఏర్పాటుకు తరలిస్తుండగా గార్గేయపురంకు చెందిన విష్ణు వర్గీయుడు దౌర్జన్యానికి పాల్పడ్డాడు. హంద్రీనీవా కాలువకు ఉన్న ఎర్రమట్టిని తమ రెడ్డి అనుమతి లేకుండా ఎలా తరలిస్తారంటూ దౌర్జన్యానికి పాల్పడి బెదిరించినట్లు సమాచారం. ఈ ఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇతను గతంలో కూడా రైతులు, వ్యాపారులు, రియల్ ఎస్టేట్ సంస్థల వారిని బెదిరించి ఘటనలో జైలుకు కూడా వెళ్లి మండలంలో సమస్యాత్మక వ్యక్తిగా మారాడు. పోలీసుల జాబితాలో కూడా సమస్యాత్మక వ్యక్తిగా ఉన్నప్పటికీ అధికార పార్టీలో కొనసాగుతుండటంతో అతని దౌర్జన్యాలపై చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

యువకుడు ఆత్మహత్య

ఓర్వకల్లు: తాగుడుకు బానిసైన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక పెండేకంటినగర్‌లో నివాసముంటున్న అక్బర్‌ఉసేన్ కొడుకు మౌలాలి(35) గత కొన్నేళ్లుగా హైదరాబాద్, కర్ణాటక ప్రాంతాలలో పాలిస్ కట్టర్‌గా పనిచేస్తుండేవాడు. అయితే, కొద్దిరోజుల నుంచి పనికి వెళ్లకుండా స్వగ్రామంలో ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తాగేందుకు డబ్బులు ఇవ్వాలని కుటుంబసభ్యులకు అడగగా వారు తిరస్కరించడంతో ఇంట్లో తలుపులు మూసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్యతో పాటు ముగురు పిల్లలు ఉన్నారు.

గాయపడిన విద్యార్థిని మృతి



చికిత్స పొందుతున్న కురవ సువర్ణ(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: ఆటో బోల్తాపడి గాయపడిన విద్యార్థిని చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. ఎమ్మిగనూరు పట్టణంలోని వెంకటాపురం కాలనీకి చెందిన కురవ వీరనాగుడు, లక్ష్మీల కుమార్తె కురవ సువర్ణ మాచాని సోమప్ప ప్రభుత్వ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. ఈ నెల 9వ తేదీన ఆటోలో వెళ్తుండగా కుక్క అడ్డురావటంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. విద్యార్థిని కురవ సువర్ణకు తీవ్ర గాయాలు కావటంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం రాత్రి మృతి చెందారు. విద్యార్థిని మృతదేహానికి స్కూల్ తరపునన ఉపాధ్యాయులు వెళ్లి నివాళులర్పించారు. కుటుంబానికి ఖర్చుల కోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి రూ. 31 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కుమార్తె మృతితో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

మల్లెపల్లి చేరిన 'హంద్రీ–నీవా' నీరు

కర్నూలు సిటీ: హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకానికి విడుదల చేసిన నీరు శుక్రవారం వెల్దుర్తి మండలం మల్లెపల్లి గ్రామ సమీపంలోని మూడో పంపింగ్ స్టేషన్‌కు చేరుకున్నాయి. ఇక్కడ నీటిని పంపింగ్ చేసేంత మట్టం రావాల్సి ఉంది. వెంటనే నాలుగో పంపింగ్ స్టేషన్‌కు నీటిని ఎత్తిపోయనున్నారు. ప్రస్తుతం మల్యాల నుంచి 1,112 క్యూసెక్కుల నీటిని మూడు పంపుల ద్వారా ఎత్తిపోస్తున్నారు.

చెట్టును ఢీకొన్న కారు

- భార్య మృతి.. భర్తకు గాయాలు



చెట్టును ఢీకొన్న కారు



లక్ష్మీబాయి (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: చెట్టును కారు ఢీకొనటంతో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. కర్నూలుకు చెందిన రామకృష్ణ, ఆయన భార్య లక్ష్మీబాయి(53) ఏపీ 21 బీఎం 9160 నంబర్ గల కారులో కర్ణాటక రాష్ట్రం సిరుగుప్పలోని తమ బంధువులను చూసేందుకు వెళ్తున్నారు. ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో కర్నూలు నుంచి వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీ కొనింది. ప్రమాదంలో రామకృష్ణకు కాలు విరిగిపోగా, భార్య లక్ష్మీబాయికి తలకు బలమైన గాయం అయ్యింది. ఇద్దరినీ అటుగా వెళ్తున్నవారు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మీబాయి కోలుకోలేక మృతి చెందింది. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రమాదంపై రామకృష్ణ బంధువులకు ఫోన్‌లో పోలీసులు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

భయం గుప్పిట్లో చదువులు




శిథిలావస్థకు చేరిన గదిలో పాఠాలు బోధిస్తున్న అధ్యాపకుడు, పెచ్చులూడిన తరగతి గది పైకప్పు

చిత్రంలో కనిపిస్తున్నది పాణ్యం డిగ్రీ కళాశాల తరగతి గది. 13 ఏళ్ల క్రితం కళాశాల మంజూరు కాగా ఇప్పటి వరకు సొంత భవనం లేదు. తాత్కాలికంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో కొన్ని తరగతి గదులను కేటాయించారు. అప్పటి నుంచి అక్కడే అసౌకర్యాల మధ్య తరగతులు కొనసాగుతున్నాయి. ఆ గదులు కూడా శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు, అధ్యాపకులు భయం గుప్పిట్లో చదువులు సాగిస్తున్నారు. దాదాపు 50 మంది విద్యార్థులు, ఆరుగురు రెగ్యులర్ అధ్యాపకులు, ఐదుగురు గెస్ట్ ఫ్యాకల్టీ సిబ్బంది ఉన్నారు. కళాశాలలో బీఏ, బీకాం కంప్యూటర్, బీఎస్సీ బోటనీ కోర్సులు మాత్రమే ఉన్నాయి. కళాశాలకు ల్యాబ్ పరికరాలు మంజూరైనా వాటిని పెట్టేందుకు గది లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో కళాశాలకు 4.50 ఎకరాల భూమి కేటాయించేందుకు ప్రతిపాదనలు పంపగా బుట్టదాఖలయ్యాయి. ఉన్నతాధికారులు స్పందించి పాణ్యం డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– పాణ్యం

చోరీ కేసులో నిందితురాలి అరెస్ట్

- 7 తులాల బంగారు స్వాధీనం

గోస్పాడు: చోరీ కేసులో ఓ మహిళను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గోస్పాడు మండలం దీబగుంట్ల గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ ఇంట్లో గత ఏడాది అక్టోబర్ నెలలో చోరీ జరిగింది. అబ్దుల్ కుటుంబం సన్నిహితంగా ఉండటంతో అప్పట్లో వహిదా వారి ఇంటికి వచ్చి ఉండేదని తెలిపారు. బంగారు చోరీకి గురైందన్న విషయాన్ని నెల క్రితం గుర్తించిన అబ్దుల్ ఇంట్లో చోరీ జరిగిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితురాలు వహీదను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో చోరీకి గురైన బంగారు విషయం తెలడంతో 7 తులాల బంగారును స్వాధీనం చేసుకొని నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోతి దాడిలో 12 మందికి గాయాలు

కోడుమూరు రూరల్: ఒక కోతి బీభత్సం సృష్టిస్తూ వారం రోజుల వ్యవధిలో 12 మందిని కరిచింది. కోడుమూరులోని చిన్నబోయ వీధి, షణ్ముఖరెడ్డి నగర్‌లలో ఉన్న సెల్ ఫోన్ టవర్లపై ఇది నివాసం ఏర్పరచుకుంది. మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఎవరు కనిపించినా దాడి చేసి గాయపరుస్తోంది. కోతి దాడి చేసి కరవడంతో రవి, మద్దిలేటి, అఖిల్, సుమలత, లక్ష్మి, బజారమ్మ, క్రిష్ణలతో పాటు మరో ఐదుగురు కోడుమూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. భయంతో ఆయా కాలనీల ప్రజలు బయటకు రావడం లేదు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కోతిని బంధించాలని ప్రజలు కోరుతున్నారు.



కోతి దాడిలో గాయపడిన వృద్ధుడు క్రిష్ణ



సెల్‌ఫోన్ టవర్‌పై ఉన్న కోతులు